ప్రజాశక్తి

సోమవారం 13 మార్చి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



ధరున్నా దైన్యమే!

- నిరాశలో మిర్చి రైతులు
- పెరిగిన సాగు ఖర్చులు.. తగ్గిన ఆదాయం..

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



మిర్చి ధరల్లో పెరుగుదలున్నా రైతుల మోములో ఆశించిన సంతోషం కన్పించడం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా మిర్చి రైతులకు ఖర్చులు భారీగా పెరిగాయి. గతేడాది కంటే ఈ ఏడాది ఎకరాకు రూ.20 నుంచి రూ.40 వేల వరకు పురుగు మందుల ఖర్చుపెరిగింది. దిగుబడి తగ్గింది. ఈ ఏడాది సగటు దిగుబడి 8 నుంచి 12 క్వింటాళ్లుగా ఉంది. ఖర్చులు ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు అవుతున్నాయి. కౌలు రైతులకు మరో రూ.20 వేల వరకు అదనంగా కౌలు ఖర్చు అవుతోంది. తామర తెగులు ప్రభావం ఈ ఏడాది కూడా కొనసాగడం వల్ల ఇబ్బడి ముబ్బడిగా పురుగుమందులను వినియోగిస్తున్నారు. వీటి వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలున్నా తప్పనిసరి పరిస్థితుల్లో వీటిని వాడుకుని పంటను కాపాడుకుంటున్నామని రైతులు వాపోతున్నారు.

గుంటూరు యార్డులో గత పక్షం రోజులుగా ధరలు పెరుగుతున్నాయి. క్రయ విక్రయాలు ఊపందుకుంటున్నాయి. మిర్చి యార్డుకు నిత్యం లక్ష టిక్కిలకుపైగా వస్తున్నాయి. సాధారణ రకాలు క్వింటాళ్ రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు పెరిగాయి. మేలైన వంగడాలు బాడిగ తదితర రకాలకు క్వింటాళ్కు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు పెరిగాయి. సాధారణ రకాలు క్వింటాళ్ గరిష్ఠంగా రూ.20 వేలు ఉండగా బాడిగ రకాలు రూ.27 వేల వరకు పలుకుతున్నట్లు వ్యాపార వర్గాలు తెలిపాయి. సీడ్ రకం రూ.25వేలు వరకు పలుకుతున్నాయి. తేజ, బాడిగ,కొత్తవి 2043 రకం ధరలు భారీగా పెరుగుతున్నాయి. 2043 రకం కొంత సరుకు గరిష్ఠంగా రూ.30 వేల వరకు పలికింది. గత వారం కంటే ఈ వారం అన్ని రకాల వెరైటీల్లో ధరల పెరుగుదల కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

గతేడాది కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న సరుకు పూర్తిగా నిండుకుని రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గుంటూరు మిర్చి యార్డుకు కొత్త సరుకు వస్తోంది. ప్రస్తుతం రాయలసీమ, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, ఎన్‌టిఆర్ జిల్లాల నుంచి కొత్త సరుకు భారీగా వస్తోంది. నాన్ ఎసి కామన్ వెరైటీ కనిష్ఠ ధర క్వింటాళ్ రూ.10 వేలు ఉండగా గరిష్ట ధర రూ.20 వేలుగా వచ్చిందని అధికారులు తెలిపారు. బాడిగ రకం కనిష్ట ధర రూ.10 వేలు, గరిష్ఠ సగటు ధర రూ.27 పలికింది. గత నెల ద్వితీయ పక్షంలో ధరలు స్వల్పంగా తగ్గగా ఈనెల ఒకటో తేదీ నుంచి ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. విదేశాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. వీటితో పాటు ఇతర రాష్ట్రాల నుంచి డొమెస్టిక్ అవసరాల కోసం ఆర్డర్లు పెరిగాయి. ఇతర రాష్ట్రాల్లో ఉన్న నాణ్యమైన మిర్చి లేకపోవడం వల్ల వ్యాపారులు ఎక్కువగా గుంటూరు వస్తున్నారు. యార్డుకు వస్తున్న మిర్చి నాణ్యత బాగుందని అందువల్ల ధరలు కూడా బాగా వచ్చాయని వ్యాపారులు తెలిపారు. కర్నాటక, మహరాష్ట్రలో మిర్చి సాగు ఆశించినంత ఉత్పత్తి రావడం లేదు. దీంతో పలు రాష్ట్రాలకు గుంటూరు మిర్చి కావాలని ఆర్డర్లు వస్తున్నాయి.

ప్రజాస్వామ్యమా...! ఫాసిస్టు రాజ్యమా?

త్రిపురలో సిపిఎం, ఇతర ప్రతిపక్షాలపై బిజెపి దాడులపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి-తాడేపల్లి

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పిలవబడే మన దేశంలో బిజెపి పచ్చిమతోన్మాద ఫాసిస్ట్ రాజ్యం నడుపుతోందని దేశంలో నడుస్తోంది ప్రజాస్వామ్యమా..? ఫాసిస్టు రాజ్యమా? అని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మండిపడ్డారు. త్రిపురలో సిపిఎం, ఇతర ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలు, ప్రజలపై దాడులను నిరసిస్తూ తాడేపల్లిలోని బోసుబొమ్మ సెంటర్‌లో ఆదివారం నిరసన చేపట్టారు. రామారావు మాట్లాడుతూ ఇటీవల ఎన్నికలు పూర్తయిన మరుక్షణం నుంచే బిజెపి తన పైశాచిక దాడులు ప్రారంభించిందని, ఆ పార్టీ గూండాలు బరితెగించి దాడులు చేస్తుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని విమర్శించారు. ఎన్నికలు ముగిసిన 10 రోజుల వ్యవధిలోనే వెయ్యికు పైగా దాడులకు బిజెపి తెగబడిందని, 700 ఇళ్లను దహనం చేశారని అన్నారు. సిపిఎం, ప్రజాసంఘాల కార్యాలయాలు పదుల సంఖ్యలో ధ్వంసం చేశారని, ఇలాంటి అనాగరిక ప్రభుత్వం అధికారంలో ఉండటానికి అర్హత లేదని దుయ్యబట్టారు. బిజెపి క్రూరమైన దాడుల నేపథ్యంలో సిపిఎం కార్యకర్తలు ఇళ్లు, ఊళ్లు వదిలి వెళ్లాల్సి వస్తోందని, అనేక మంది బాధితులు తమ ఆస్తులను కోల్పోయి కట్టుబట్టలతో రోడ్డు పడ్డారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ దౌర్జన్యకాండ ఎంతోకాలం సాగదని, దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు డి.శ్రీనివాసకుమారి, జి.సుబ్బారెడ్డి, కె.కరుణాకరరావు, వి.దుర్గారావు, కె.మేరి, కె.బాబూరావు, ఎస్.ముత్యాలరావు, బి.దశరథరామిరెడ్డి, బి.గోపాల్‌రెడ్డి, డివి భాస్కరరెడ్డి, కె.వెంగమ్మ, వై.బర్నబాసు, కె.ప్రభాకర్ పాల్గొన్నారు.



నిరసనలో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

దళితుల భూములకు పట్టాలివ్వండి

- గురజవోలులో పొలాలను పరిశీలించిన వ్యవసాయ కార్మిక సంఘం
- ముంపునకు గురిచేసేందుకు పెత్తందార్లు కుట్ర పన్నుతున్నారని విమర్శ
- భూములను దక్కించుకునేందుకు పోరాట కమిటీ ఎన్నిక 8 లో

రైస్‌మిల్లుల్లో భారీగా రేషన్ బియ్యం

- 1494 క్వింటాళ్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు
- మిల్లు, వాహన యజమానులపై కేసులు

2 లో



మిల్లులో స్వాధీనం చేసుకున్న బియ్యం వద్ద విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పట్టుబడిన వారు

క్షయ నివారణకు చర్యలు 8 లో

ఇంటర్వ్యూ

- జిల్లా వ్యాప్తంగా ఆరు కేంద్రాల్లో చికిత్స
- ఆరు నెలల పాటు ఉచితంగా పోషకాహారం
- ప్రజాశక్తితో జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ బి.లక్ష్మానాయక్

పంటసాగు ధ్రువపత్రాల జారీలో అవకతవకలు

పలువురు అధికారులపై చర్యలు 2 పేజీ

రేపు పంచాయతీ కార్మికుల నిరాహార దీక్ష

ప్రజాశక్తి -ఫిరంగిపురం

పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని ఫిరంగిపురం మండలం సిఐటియు కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి కోరారు. కార్మికులకు జీతాలు చెల్లించాలని, తదితర సమస్యల పరిష్కారానికై మంగళవారం స్థానిక ఫిరంగిపురం పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిరాహార దీక్ష చెపడుతున్నట్లు తెలిపారు. ప్రతినెలా జీతాలు ఇవ్వాలని, టెండర్ విధానం రద్దు చేయాలని ,ప్రస్తుతం పని చేస్తున్న వారికి రెగ్యులర్ చేయాలని, గ్రీన్ అంబాసిడర్లకు ధరల పెరుగుదలకు అనుగుణంగా జీతాలు పెంచాలని అన్నారు. వారాంతపు సెలవు ,యూనిఫారం, సబ్బులు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని అన్నారు. ప్రావిడెంట్ ఫండు, ఈఎస్‌ఐ అమలు చేయాలని కోరుతూ నిరాహార దీక చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా గౌరవ అధ్యక్షులు వై నేతాజీ ,మండల గౌరవ అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, మండల అధ్యక్షులు సిహెచ్ రామారావు, మండల కార్యదర్శి బి ఇబ్రహీం, మండలంలోని అన్నీ గ్రామాల పంచాయతీ వర్కర్స్, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

నేడు జరిగే ఛలో రాజ్ భవన్‌కు తరలి రండి

ప్రజాశక్తి-ఫిరంగిపురం

ప్రధాని నరేంద్ర మోడీ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు నాయకత్వంలో సోమవారం తలపెట్టనున్న ఛలో రాజ్ భవన్ కార్యక్రమానికి కాంగ్రెస్ అన్ని విభాగాల శ్రేణులు తరలి రావాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం.పాల్ విజయ కుమార్ కోరారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పరిపాలనా కాలంలో ప్రభుత్వరంగ సంస్థలైన ఎల్ఐసి,రైల్వేలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలను అదాని లాటి వారికి అప్పగిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్నారని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న వైఖరికి నిరసనగా చలో రాజభవన్‌కు కాంగ్రెస్ కార్యకర్తలు తరలి రావాలని కోరారు. ఫిరంగిపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెలిచర్ల రాజారావు, యూత్ కాంగ్రెస్ నాయకులు వలపర్లకిరణ్ మోజెస్ పాల్, గద్దె జేసుదాస్, కార్యంసెట్టీ సందీప్ తదితరుల పాల్గొన్నారు.

కార్టూన్ల పోటీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-విజయవాడ: ఘంటా ఇందిర స్మారకంగా మల్లెతీగ నిర్వహించిన కార్టూన్ల పోటీ ఫలితాలను ఆదివారం కృష్ణానదీ తీరాన విడుదల చేశారు. రూ. 10 వేల అత్యుత్తమ బహుమతిని విజయవాడకు చెందిన బొమ్మన్, రూ.5 వేల ఉత్తమ బహుమతిని హైదరాబాద్‌కు చెందిన మాధవ్ గెలుచుకున్నారు. రూ.500 ప్రత్యేక బహుమతుల్ని వల్లూరి కృష్ణ (హైదరాబాద్), పి.చిదంబరం (విజయవాడ), జెన్నా (విశాఖపట్నం), ప్రసిద్ధ (హైదరాబాద్), భూపతి (కరీంనగర్), గోపాలకష్ణ (పెనుగొండ), డి.శంకర్ (కోరుట్ల), ఆదినారాయణ (విజయవాడ), నాగిశెట్టి (విజయవాడ), ఎన్.శేషయ్య (తిరుపతి), పైడి శ్రీనివాస్ (వరంగల్), వినోద్ (సఖినేటిపల్లి), అరుణ్ (హైదరాబాద్), మురళీధర్ (విజయవాడ) గెలుచుకున్నారు. ఈ సందర్భంగా బహుమతి ప్రదాత ఘంటా విజయకుమార్ మాట్లాడుతూ గుండెగాయమై రక్తమోడుతున్న పర్యావరణాన్ని, వివిధ రంగాల్ని ప్రభావితం చేస్తున్న రాజకీయ రంగాన్ని, తన అభివృద్ధి కోసం వినియోగించుకోవాల్సిన సోషల్ మీడియాని మనిషి మరో కోణంలో ఉపయోగించుకుంటూ తన జీవితాన్ని, మనుగడని, భవిష్యత్తుని, చివరికి దేహాన్ని కూడా ఛిద్రం చేసుకుంటున్న విపరీత పోకడల్ని, మసిబారుతున్న మానవీయ విలువల్ని, మానవత్వాన్ని తమ కార్టూన్లలో కార్టూనిస్టులు ప్రతిఫలింపజేశారన్నారు. మల్లెతీగ వ్యవస్థాపక అధ్యక్షులు కలిమిశ్రీ మాట్లాడుతూ ఒక సినిమా, ఒక నవల, ఒక కథ, ఒక కవితలో చెప్పే గొప్ప సందేశాన్ని చిన్న కార్టూన్లో అందించగల నేర్పరులు, మానసికశాస్త్ర నిపుణులు, సమాజ పథ నిర్దేశకులు కార్టూనిస్టులు అని అన్నారు. వై.జె టీవీ ఎండీ గంగాధర్ మాట్లాడుతూ కార్టూన్ల పోటీలు పెట్టి కార్టూనిస్టుల్ని ప్రోత్సహించడం, ఒక్క కార్టూన్‌కు బహుమతిగా ఇవ్వడం తెలుగు పత్రికా రంగంలో ఇదే ప్రథమమన్నారు.

రైస్‌మిల్లులో భారీగా రేషన్ బియ్యం

- **1494 క్వింటాళ్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు**
- **మిల్లు, వాహన యజమానులపై కేసులు**

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఓ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ రేషన్ బియ్యం నిల్వలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తొలుత బియ్యాన్ని తరలిస్తున్న వాహనాలపై నిఘా వేసిన అధికారులు వాటిని వెంబడించి చివరికి అక్రమ నిల్వలను గుర్తించారు. దీనిపై వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పేరేచర్ల నుండి రేషన్ బియ్యం అక్రమంగా వాహనాల్లో తరలుతున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం అర్ధరాత్రి నిఘా వేశారు. వాహనాలు వెళ్తుండగా వాటిని వెంబడించారు. అవి తిన్నగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడిలోని విఘ్నేశ్వర రైస్‌మిల్లుకు వెళ్లాయి. దీంతో వెంటనే మిల్లులోకి ప్రవేశించిన అధికారులు తనిఖీలు చేపట్టారు. మిల్లులో నిల్వ ఉన్న 1493 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పౌరసరఫరాల శాఖ ముద్ర ఉన్న సుమారు 4 వేల ఖాళీ గోతాలను స్వాధీనం చేసుకున్నారు. మూడు వాహనాలను అదుపులోకి తీసుకుని వాటి యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయగా మిల్లు యజమాని గంగాధర్‌రెడ్డిపై 6ఎ కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీనివాసరావు, సిఐ శ్రీహరి, ఎస్‌ఐ రామచంద్రయ్య, విజిలెన్స్ తహశీల్దార్ నాగమల్లేశ్వరరావు, పౌరసరఫరాల శాఖాధికారులు పాల్గొన్నారు.

పంటసాగు ధ్రువపత్రాల జారీలో అవకతవకలు

పలువురు అధికారులపై చర్యలు

ప్రజాశక్తి - నరసరావుపేట

అనర్హులకు సాగు ధ్రువపత్రాలు జారీ చేశారనే అంశంలో పలువురు అధికారులపై చర్యలు తీసుకుంటూ పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది డిసెంబర్‌లో వెల్దుర్తి మండలం గంగలకుంట, రచ్చమల్లపాడు గ్రామాల్లో అనర్హులకు పంట సాగు పత్రములు ఇవ్వడంతోపాటు వారికి 'రైతు భరోసా' పథకం వర్తింపజేశారని ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి విచారణ చేపట్టారు. అవకతవకలు జరిగినట్లు నిర్ధారణవడంతో గంగలకుంట విఆర్ఒ బాతుల ఉమాదేవి, ఉద్యాన శాఖ సహాయకులు కొండలవాతు శివానాయక్, రచ్చమల్లపాడు విఆర్ఒ పి.జానయ్య, గ్రామ ఉద్యాన శాఖ సహాయకులు నూదుల వెంకటేశ్వర్లుపై ఒక వార్షిక ఇంక్రిమెంటు (వితౌట్ క్యుములేటివ్ ఎఫెక్ట్) నిలుపుదలకు కలెక్టర్ ఆదేశాలిచ్చారు. పంట సాగు పత్రాలు మంజూరు విషయంలో అసమర్థంగా వ్యవహరించిన వెల్దుర్తి తహశీల్దార్ శ్రీనివాస యాదవ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం నుండి ఆదివారం ప్రకటన విడుదల చేశారు.

పెద్ద మసీదుపై దుష్ప్రచారం తగదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో వందేళ్ల చరిత్ర కలిగిన పెద్ద మసీదు నిర్వహణ, ఆస్తుల పరిరక్షణపై కొంత మంది పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని మసీదు ముతవల్లి ఎం.ఎ.కలీం బేగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మసీదులో అభివృద్ధి పనులన్నీ సక్రమంగా జరుగుతున్నాయని తెలిపారు. మసీదు ఆస్తులను పరిరక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. కొంత మంది వ్యక్తులు మసీదు నిర్వహణపై అపోహలు సృష్టిస్తున్నారని వాటిని నమ్మవద్దని ముస్లిం సోదరులంతా సంయమనంతో వ్యవహరించాలని ఆయన కోరారు.

పలుచోట్ల వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు విలేకర్ల యంత్రాంగం :

వైసిపి 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గుంటూరు బృందావన్ గార్డెన్స్ పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. మొదటిగా జిల్లా పార్టీ అధ్యక్షులు పార్టీ జెండా వేఇసి కేక్ కటింగ్ చేశారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తాడేపల్లిలో వైసిపి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కొత్తూరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పట్టణంలోని మున్సిపల్ జోనల్ కార్యాలయం వద్ద వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కె.మహాలక్ష్మి, సీనియర్ నాయకులు కె. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.డేవిడ్ రాజ్, ఎం. వెంకటరామిరెడ్డి, పాల్గొన్నారు. మంగళగిరిలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం నుండి కొత్త బస్టాండ్ సెంటర్లో గల వైయస్సార్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం 12 కేజీల కేకును కట్ చేశారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి,పాల్గొన్నారు. పొన్నూరు పట్టణ వైసిపి కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆధ్వర్యంలో వైసిపి ఆవిర్భావదినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. .దుగ్గిరాలలో


తాడేపల్లి వేడుకల్లో పాల్గొన్న నాయకులు , కార్యకర్తలు

ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి. కుషిబాయి, బి.వెంకటేశ్వర నాయక్ ,డి.వీరయ్య పాల్గొన్నారు. తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ కత్తిర సురేష్ కుమార్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా తాడికొండ నియోజకవర్గంలోని ఫిరంగిపురం, తాడికొండ మండలాల్లో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఎర్రగుంట్ల పాడు ఎస్సీ కాలనీలోవైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెనాలిలో ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణ వైసిపి నాయకులు ఘనంగా నిర్వహించారు.తొలత మున్సిపల్ ఛైర్పర్సన్ సయ్యద్ ఖాలేదా నశీమ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. రాజశేఖరరెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్పర్సన్ అవుతు సీత నగేష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు దేసు శ్రీనివాసరావు, కిరణ్ కుమార్, హరీష్ పాల్గున్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అల్తాఫ్

80 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్.

స్థానిక పిఎఎస్ కళాశాలలో గుంటూరు శ్రీ హాస్పిటల్ వారి సహకారంతో శ్రీ సమిష్ట హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇన్సిట్యూట్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ గోమతీదేవి డాక్టర్ అల్తాఫ్‌లు పాల్గొని 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి హస్పటల్ సహకారంతో ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య, ఎన్‌సిసి అధికారి డాక్టర్ పాతూరి శ్రీనివాస్, హాస్పటల్ పిఆర్‌ఓలు దుర్గాప్రసాద్ ,కిషోర్‌లు పాల్గొన్నారు.



రవికుమారును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ

ఎన్టీఆర్ రాజకీయ జీవితంపై సమీక్ష

ప్రజాశక్తి తెనాలి

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రతి శనివారం, ఆదివారం ఎన్టీఆర్ వ్యక్తిత్వం, ఆయన నటించిన సినిమాలు, రాజకీయ జీవితంపై జరిగే చర్చా కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక పెన్షనర్స్అసోసియేషన్ హాల్లో ఎన్టీఆర్ తయారు చేసిన నాయకులు అంశంపై సమీక్ష జరిపారు. ముఖ్య వక్తలుగా కాల్వ బాపూజి, తాళ్ళూరి రాజేంద్రప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కళాకారుడు పినపాటి రవికుమార్‌తో పాటు వక్తలను సన్మానించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో అయినాల మల్లేశ్వరరావు, మాదల కోటేశ్వరరావు, దేవరపల్లి భవాని,ఎన్టీఆర్ జగన్, ఎం. రాఘవరావు, సూరపనేని అనురాధ, రావూరి లక్ష్మీప్రసన్న, దేవిశెట్టి భాస్కర్, శేషు, మధు, సుబ్రహ్మణ్యం, ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

గాసుల కృష్ణకు సతీ వియోగం

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి సీతానగరం, టిడిపి వాణిజ్యం సెల్, కార్యదర్శి, గాజుల కృష్ణ సతీమణి దుర్గ అనారోగ్యంతో ఆదివారం మరణించారు. టిడిపి నాయకులు సీతానగరం ఇంటి వద్ద ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి ఘనమైన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మహమ్మద్ ఇబ్రహీం, ఎన్.ఏడుకొండలు, కె. శైలజ, పి. కృష్ణవేణి, జివి రమాదేవి, పద్యాల కమల నాభుడు, కె. అనిల్ చౌదరి, ఎం కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

ఆకతాయిల ఆటకట్టించండి

- సత్తెనపల్లిలో మున్సిపల్ కార్యాలయం ఎదురు, గార్లపాడు బస్టాండ్ సెంటర్ వద్ద అల్లరిమూకలు
- వృద్ధులు, మహిళలకు ఇబ్బంది కలిగిస్తున్న మందు బాబులు
- రిటైర్డ్ ఉద్యోగి కాలుకి గాయం
- పోలీస్ నిఘా పెట్టాలని బాధితుల వినతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురు, గార్లపాడు బస్టాండ్ సెంటర్‌లో ఆకతాయిల ఆగ డాలతో మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయా ప్రాంతాల్లో ప్రతిరోజు సాయంత్రం ఏడు గంటల నుండి రాత్రి 11 గంటల వరకు అల్లరి మూకలు మందు తాగుతూ రోడ్లపైనే గుంపులు గుంపులుగా చేరడం, అటుగా వెళుతున్న వృద్ధులు, మహిళలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా బజార్లల గండా మహిళలు,వద్దులు వెళుతున్న పక్కకు తొలగకపోగా వాళ్లకు తగులుతూ ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదేంటని వారిని ప్రశ్నిస్తే ఎక్కడ గొడవకు దిగుతారేమోనని భయంతో తలవంచుకొని వెళ్ళి పోతున్నామని బాధితులు వాపోతున్నారు. ఇటీవల మున్సి పల్ కార్యాలయం ముందు ఇద్దరు వ్యక్తులు వాదోప వాదాలాడుతూ ఘర్షణకు దిగారు. ఆ ఇద్దరు వ్యక్తులు ఆ పక్కనే ఉన్న ఓ రిటైర్డ్ ఉద్యోగిపై పడటంతో అతను కిందపడి పోవడంతో కాలుకి గాయమవ్వడమే కాక, ఆయన సెల్ ఫోను కిందపడి పగిలిపోయింది. ఇప్పటికైనా పోలీసులు ఆయా ప్రాంతాలలో నిఘా పెట్టి ఆకతాయిల ఆట కట్టిం చాలని బాధిత మహిళలు, వృద్ధులు కోరుతున్నారు.



గోదాములో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పిడుగురాళ్ల పట్నంలోని చెరువు కట్ట బజారులో కురుకురే ప్యాకెట్లు హెూల్ సేల్ స్టాక్ నిల్వ ఉండే గోడౌన్లో ఆదివారం అకస్మాత్తుగా మంటలుచెలరేగాయి. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ అగ్ని ప్రమాదంజరిగినట్లు షాప్ యజ మాని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.ఆదివారం కావడంతో గోడౌన్లో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.

దేవస్థానం ఉద్యోగిపై క్రిమినల్ కేసు

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవ స్థానానికి వచ్చిన ఆదా యాన్ని తక్కువగా చూపిన జూనియర్ అ సిస్టెంట్ పై క్రిమినల్ కేసు నమోదైంది. ఈ మేరకు ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం దేవస్థానం ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.23 లక్షల 77 వేల 777 నగదును పక్కదారి పట్టించిన జూనియర్ అసిస్టెంట్ వాసు పై క్రిమినల్ కేసు నమోదైందని చెప్పారు. 2019-22 సంవత్సరాల మధ్య కాలంలో వాసు అక్రమాలకు పాల్పడినట్లుగా తెలిపారు. ఇప్పటికే సస్పెన్షన్ వేటు వేయడం జరిగిందని అన్నారు.



మాట్లాడుతున్న ఈవో రామకోటిరెడ్డి

అడుగంటిన భూగర్భ జలాలు

మొరాయిస్తున్న చేతిపంపులు - కృష్ణా పరివాహక ప్రాంతాల్లో అడ్డగోలు ఇసుక తవ్వకాలతో సమస్య

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

అడ్డగోలు ఇసుక తవ్వకాలతో కృష్ణానది పరివాహక ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటాయి. సమీప గ్రామాల్లో చేతిపంపులు (హ్యాండ్‌బోర్లు) మొరాయిస్తున్నాయి. నది పక్కనే ఉన్నా సమీప గ్రామాల్లోని ప్రజలు నీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోంది. పెనమలూరు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు తదితర మండలాల గుండా కృష్ణానది ప్రవహిస్తోంది. అవనిగడ్డ మండలంలోని పులిగడ్డ వద్ద రెండు పాయలుగా చీలి నాగాయలంక, కోడూరు మండలాల్లో సముద్రంలో కలుస్తోంది. గత మూడేళ్ళుగా ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో వర్షాకాలంలో సుదీర్ఘకాలంపాటు నదీ ప్రవహించింది. వేలాది టిఎంసిల నీరు సముద్రంలో కలిసింది. నదీ ప్రవాహ కాలం ఎక్కువ ఉండటంతో పరివాహక ప్రాంతాల్లో భూ గర్భజల మట్టాలు పెరిగాయి. వర్షాకాలంలో నీటి మట్టాలు పెరిగినా వేసవి వచ్చే సరికి అడుగంటుతున్నాయి. ఘంటసాల మండలం శ్రీకాకుళం, పాపవినాశనం, అచ్చంపాలెం, తెలుగురావుపాలెం, చల్లపల్లి మండలంలోని నడకుదురు, నిమ్మగడ్డ, వెలువోలు, పొరిటిగడ్డ, నాదేళ్లవారిపాలెం, పొరిటిగడ్డ తదితర గ్రామాల్లోని పంపులు నీరు రాకుండా మొరాయిస్తున్నాయి.

ఇసుక, బుసక తవ్వకాలతోనే సమస్య

నదీ గర్భంలో నిల్వ ఉండే ఇసుక, బుసకలు నదిలోని పెలో ఛానల్స్ (భూగర్భ నదీ పాయలు) రీఛార్జికి దోహదకారిగా ఉంటాయి. ఇటీవల కాలంలో ఇళ్ళ నిర్మాణానికి ఇసుక, జగనన్న కాలనీలు, ప్రయిఏవటు లే అవుట్ల మెరక చేయడానికి, జాతీయ రహదారులు నిర్మాణాలకు నదీగర్భంలోని బుసకను రోజువారీ వందలాది టిప్పర్లలో పెద్ద మొత్తంలో తరలిస్తున్నారు. దీంతో రీచార్జి పెలో ఛానల్స్ లో రీచార్జి తగ్గిపోతోంది. ఈ క్రమంలోనే వ్యవసాయ అవసరాలకు ఉపయోగించే బోర్లు నీరు అడుగంటుతోంది. 30 అడుగులకన్నా అడుక్కి భూగర్భజల మట్టిపోవడంతో వ్యవసాయ . బోర్లకు పైన అమర్చి విద్యుత్ మోటర్లు, అయిల్ ఇంజన్లు నీటిని తోడలేక మొరాయిస్తున్నాయి. గత కొన్నేళ్ళుగా భూగర్భంలోని నీటిని తోడేందుకు బోర్ల లోపల నుంచి నీటిని వెలుపలకు ఎత్తిపోసే సబ్‌మెర్సిబుల్ మోటర్లను వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెలో ఛానల్స్ రీచార్జి తగ్గిపోవడం , సబ్‌మెర్సిబుల్ మోటర్ల వినియోగం పెరడంతో భూగర్భ జలం అడుగంటుతోంది. ఈ ఏడాది మార్చి మొదటి వారం నుంచే పలు గ్రామాల్లో చేతి పంపులు మొరాయించాయి.

తాగునీటికి సమస్య



కృష్ణానదీ పరివాహక ప్రాంత భూగర్భ జలంలో తీపి ఎక్కువగా ఉంటుంది. గ్రామాల్లోని ప్రజలు ఇళ్ళ వద్ద ఉన్న చేతి పంపుల్లోని నీటినే ఎక్కువగా తాగునీటి అవసరాలకు వినియోగిస్తారు. భూగర్భజలాలు అడుగంటంతో మినరల్ వాటర్ ప్లాంట్లలో నీటిని కొనుగోలు చేసి తాగునీటికి ఉపయోగించాల్సి వస్తోంది.

కిడ్నీ సమస్య పరిష్కారానికి

సిఎం స్పష్టమైన హామీనివ్వాలి

ప్రజాశక్తి-తిరువూరు: ఈ నెల 18వ తేదీన తిరువూరు వస్తున్న సిఎం జగన్ కిడ్నీ సమస్య పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి కృష్ణ కోరారు. సమస్యలపై సిఎంకు వినతిపత్రం ఇచ్చేందుకు కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న గిరిజనులకు అవకాశం కల్పించాలన్నారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎ.కొండూరు పరిసర మండలాల్లో కిడ్నీ సమస్యతో 200 మంది వరకు చనిపోయారన్నారు. ఈ సమస్యతో వేల మంది గిరిజనులు, దళితులు, పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతినెలా వేలాది రూపాయలు అప్పులు చేసి, ఉన్న కొద్ది భూములు అమ్ముకుని జీవిస్తున్నారని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించాలని సిపిఎం, వివిధ ప్రజాసంఘాలు గత ఐదేళ్లుగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నాయని తెలిపారు. కిడ్నీ క్రియాటిన్ ఉన్న వారికి నెలకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని, తిరువూరు నియోజవర్గానికి శుద్ధి చేసిన కృష్ణా జలాలను ఇంటింటికి కుళాయిల ద్వారా అందించాలని, కిడ్నీ వ్యాధి బారిన పడి చనిపోయిన కుటుంబాలకు ఎకరం భూమి ఇవ్వాలని, ఉద్దానం తరహా కిడ్నీ హాస్పటల్ వెంటనే ప్రారంభించాలని, కిడ్నీ రోగులకు ఉచితంగా మందులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం తిరువూరు వచ్చే నాటికి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు కిడ్నీ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. టిడ్కో ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నాగేంద్రప్రసాద్, మండల కార్యదర్శి సాంబార్ వెంకటేశ్వర్లు, పట్టణ నాయకులు చప్పిడి సురేష్, బలగాని వెంకటేశ్వరరావు, ఆకుల రవి, ఎం.ప్రభాకర్‌రావు, ఎస్.కుమారి పంతంగి తులసిరాణి, చెరుకు సత్యనారాయణ, షేక్ నాగుల్ మీరా, కూరపాటి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ప్రజాశక్తి-వినుకొండ

మహిళలు చైతన్యవంతులై అన్ని రంగాల్లో రాణించాలని ఐద్వా పల్నాడు జిల్లా అధ్యక్షులు రంజాన్ బి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వినుకొండ పట్టణంలోని సుందరయ్య కాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఇంటికే పరిమితం కాకుండా మంచి విద్యాబుద్ధులు నేర్చుకొని, పిల్లలను బాగా చదివించుకుని అన్ని రంగాల్లో ముందుం డాలన్నారు. సమాజంపై అవగాహన పెంపొందించుకొని ఇంటితో పాటు సమాజం శ్రేయస్సులో కూడా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి నాసర్ బి, సిఐటియు నాయకులు అంగలకుదురు ఆంజనేయులు, మనం నారాయణ, సుందరయ్య కాలనీ మహిళలు పాల్గొన్నారు.



ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి

ప్రజాశక్తి-వినుకొండ

కార్మికులందరూ ఐక్యంగా ఉండి వారి హక్కులను సాధించుకోవాలని సిఐటియు పల్నాడు జిల్లా కోశాధికారి అంగలకుదురు ఆంజనేయులు అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం డివిజన కమిటీ సమావేశం ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో పప్పూరి వెంకటప్పయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో కార్మికులకు ఏడు కోట్లు పరిహారం నగదు, వినుకొండ ప్రాంతంలో 2,000 మంది కార్మికులకు గుర్తింపు కార్డులు రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కార్మికులకు పరిహార సొమ్ముతో పాటు గుర్తింపు కార్డులు ఇప్పించాల్సిందిగా డిమాండ్ చేశారు. సిపిఎం టౌన్ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్య పోరాటం ద్వారా హక్కులు సాధించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో షేక్ మదర్ వలి, వీర బ్రహ్మాచారి, బండి కోటయ్య, నారాయణ, నాజర్‌బి పాల్గొన్నారు.



వియత్నాం భౌద్ధుల సహకారంతో బోరింగు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని తొండపి యానాది కాలనీలో వియత్నాం దేశ భౌద్ధ సంఘం ఆర్థిక సహకారంతో రూ. 40 వేలతో మంచినీటి పంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంచినీటి పంపును సత్తైనపల్లి ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి వియత్నాం బౌద్ధ భిక్షువులు హాజరై బౌద్ధ మంగళ సుత్త పారాయణం చేశారు. ఆ ప్రాంత శాంతిని కాంక్షించారు. ఈ సందర్భంగా బౌద్ధ సంఘానికి కాలనీ వాసులు తమ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కాసరబాద నాగేశ్వరరావు, ఎమ్. సాంబశివరావు, బి.రవి చంద్రారెడ్డి, చల్లా శేషయ్య తదితరులు పాల్గొన్నారు

విద్యాసంవత్సరం ముగుస్తున్నా.. కూలి ఏదన్నా..

- 'జగనన్న విద్యా కానుక' పై విమర్శలు
- త్వరలో ముగియనున్న విద్యా సంవత్సరం
- అయినా.. అందని కుట్టుకూలి ఛార్జీలు



ప్రజాశక్తి-చిలకలూరిపేట

కొన్ని రోజుల్లో ప్రస్తుత విద్యా సంవత్సరం ముగియనున్నా జగనన్న విద్యా కానుక కింద విద్యార్థులకు ఇచ్చే కుట్టు కూలీ ఛార్జీలు మాత్రం వారికి అందడం లేదు. ఈ విషయమై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం హయాంలో విద్యార్థులకు యూనిఫామ్ క్లాత్ ఇచ్చి, కుట్టు కూలీ నిమిత్తం 1వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఒకొక్క జతకు రూ.40 చొప్పున, 9,10వ తరగతుల విద్యార్థులకు ఒక్కో జతకు రూ.80 చొప్పున ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్‌లో భాగంగా యూనిఫామ్ క్లాత్ ఇచ్చి, వాటికి కుట్టు కూలీ ఛార్జీలను చెల్లిస్తోంది. ప్రతి ఏడాది ఒక్కొక్క విద్యార్థికి యూనిఫామ్ కింద మూడు జతలకు కుట్టుకూలీ ఛార్జీలు కూడా గత ప్రభుత్వంల ఇచ్చిన విధంగానే ఇస్తోంది. ఆయా మొత్తాలను విద్యార్థుల తల్లుల ఖాతాకు జమ చేస్తున్నారు. అయితే, ప్రస్తుత, గత విద్యా సంవత్సరానికి సంబంధించిన ఆ ఛార్జీలను ఇంతవరకు చెల్లించలేదు. దీంతో పేదలు, నిరుపేదలు ఆ డబ్బులకు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం బయట కుట్టుకూలీ ధరలకే కుట్టించుకోవాల్సి వస్తోంది.

చిలకలూరిపేట పట్టణంలో 27 మున్సిపల్ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాల ఒకటి, జెడ్పి, ఉన్నత పాఠశాలలు 29 వరకు ఉన్నాయి. ఇవికాక, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని ప్రాథమిక, మాధ్యమిక, గురుకుల పాఠశాలలు 55. మండలంలో మొత్తం పాఠశాలల సంఖ్య 84 ఉన్నట్లు విద్యాశాఖ సమాచారం. ప్రస్తుతం 1 నుంచి 8వ తరగతి వరకు పట్టణంలో సుమారు 4,500 మంది విద్యార్థులకు గాను సుమారు రూ.5.40 లక్షలు, 9 తరగతి చదివే విద్యార్థులు సుమారు 1400 మందికి గాను రూ.3.36 లక్షలు, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు సుమారు 1300 మందికి గాను సుమారు రూ.3.12 లక్షలు చెల్లించాల్సి ఉంది. 2022-2023 విద్యా సంవత్సరానికి గాను ఒక్క చిలకలూరిపేట పట్టణంలోనే విద్యార్థినీ విద్యార్థులకు చెల్లించాల్సిన కుట్టుకూలీ చార్జీలు రూ.11.88 లక్షలు. ప్రస్తుత విద్యా సంవత్సరంతో పాటు గత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు చెల్లించాల్సి కుట్టుకూలీ ఛార్జీలు కూడా కలిపితే మొత్తం రూ.23.76 లక్షలు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది.

గత ఏడాది పదో తరగతి చదివిన విద్యార్థినీ విద్యార్థులు సుమారు 1300 మం దికి కుట్టుకూలీ ఛార్జీలు రాలేదు. ఈ ఏడాదిలో కుట్టుకూలీ చార్జీలు రావాల్సిన విద్యార్థుల సంఖ్య కూడా దాదాపు 1300 మంది. చిలకలూరిపేట పట్టణ, మండలంలోనే కాక నియోజవర్గం పరిధిలోని మిగిలిన రెండు మండలాలు యడ్లపాడు, నాదెండ్లలోని పాఠశాలల విద్యార్థులకు కూడా కుట్టు కూలీ ఛార్జీలు ఇంతవరకూ అందలేదు.

విద్యార్థులకు అన్యాయం



చిలకలూరిపేట పట్టణ ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు టి. సిద్ధు, రమా దేవి మాట్లాడుతూ సీఎం జగన్ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. విద్యార్థుల తల్లులకు కొంతమందికి బ్యాంక్ ఖాతాలు లేని వారు ఉన్నా రని, వారికి రావాల్సిన డబ్బులు ఆయా విద్యార్థులకు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యా దీవెన ,వసతి దీవెన పథకాల కింద పెండింగ్‌లో ఉన్న డబ్బులను విద్యార్థులకు ఇవ్వాలని అన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్నా అమ్మ ఒడి,విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు సంబంధించిన డబ్బులు కూడా అరకొరగానే వచ్చాయన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పందించి కుట్టు కూలీ చార్జీలను తల్లుల ఖాతాల్లో వేయాలని కోరారు.

శాలివాహన సంఘం నూతన అధ్యక్షులుగా గోవిందరాజులు

ప్రజాశక్తి-వినుకొండ



నియోజకవర్గ కుమ్మర శాలివాహన సంగం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఫర్టిలైజర్ అసోసియేషన్ హాల్‌లో నిర్వ హించిన కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పల్నాడు జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షులు పారేళ్ల రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలాపురం భాస్కర్ శ్రీనివాస బాబు హాజరై మాట్లాడుతూ శాలివాహన సంఘీయులు ఐక్యమత్యంతో ఉండి రాజకీయంగా ఎదగాలని కోరారు. శాలివాహనులకు ఏమైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీని ప్రమాణస్వీకారం చేయించారు. సభ్యులను ఘనంగా సత్కరించారు. వినుకొండ నియోజకవర్గం శాలివాహన సంఘం నూతన అధ్యక్షులుగా గొట్టం గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శిగా మద్దికుంట ఆదినారాయణ, కోశాధికారిగా పారెళ్ల లక్ష్మయ్యను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఉపాధ్యక్షులుగా పారేళ్ల దాసయ్య, రాజావరపు కృష్ణ, చీరాల ఆంజనేయులు, చీరాల కోటయ్య, వివిధ మండలాల శాలివాహన సంఘ అధ్యక్షులుగా రాజా రపు ఏడుకొండలు, పారేళ్ల కమలాకర్ రావు, రాజారపు వినోద్ బాబు ఎన్నికయ్యారు.



మహిళా దినోత్సవం సందర్భంగా నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి-వినుకొండ

స్నేహ సంగీతా నాట్య కళాక్షేత్రం ప్రతిమ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక శివయ్య స్తూపం సెంటర్‌లో ఆదివారం మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులు భారతీయ సంస్కృతీ సంప్రదాయాల గురించి భరతనాట్యంలో ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ షకీలా, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహించాలి, గౌరవించాలని, విద్యార్థినుల పట్ల వారి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ మాటాడుతూ తమ విద్యార్థులు ప్రతిభ రాష్ట్రంలోనే కాకుండా ఇతర దేశాలలో కూడా గుర్తించి ప్రదర్శనకు ఆహ్వానించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా భరతనాట్య ప్రదర్శించిన విద్యార్థినులను ఆయన అభినందించారు.

ఉప్పలపాడులో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-నరసరావుపేట

ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ నెల్లూరి రమేష్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉప్పలపాడులో ప్రసన్న సాయి రామ్ కళ్యాణ మండపంలో తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. 150 మందికి పైగా గ్రామస్తులకు మెదడు, నరాలు, బిపి, షుగర్ లకు వైద్య పరీక్షలు, డాక్టర్ బెల్లం అనూష ఆధ్వర్యంలో చర్మ సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. రానున్న రోజులలో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలతో పాటు ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య బృందాన్ని గ్రామస్తులు అభినందించారు. అనంతరం వైద్య శిబిరం వద్ద గ్రామస్తులకు మామిడి, జామ ,సపోటా మొదలైన పండ్ల మొక్కలను పంపిణీ చేశారు.




తాడేపల్లిలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు


మేడికొండూరులో మాట్లాడుతున్న వై.నేతాజీ


చిర్రావూరులో ప్రచారంలో నాయకులు

ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ చలో ఢిల్లీ

ప్రజాశక్తి-తాడేపల్లి

రాష్ట్రంలోని పాలకపార్టీల పట్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు చెప్పారు. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ప్రజా ఉద్యమాల వైపు మరల్చాలని సిపిఎం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఆదివారం తాడేపల్లి మేక అమరారెడ్డి భవన్‌లో సిపిఎం పట్టణ కమిటీ విస్తృత సమావేశం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి.శ్రీనివాసకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సంస్కరణల వేగవంతం వల్ల దేశంలో ఆర్థిక మాంద్యం వచ్చే అవకాశముందని హెచ్చరించారు. దేశ వ్యాప్తంగా మూడు లక్షల మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను ఆయా కంపెనీలు తొలగించాయని చెప్పారు. భవిష్యత్‌లో నిరుద్యోగం పెరిగి ఉన్న ఉద్యోగాలు ఊడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం గవర్నర్ల వ్యవస్థను అడ్డుపెట్టుకుని, రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. మోదీ పాలన వ్యతిరేకించిన వారిపై, ఈడీ, సిబిఐ లాంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతోందని దుయ్యబట్టారు. ముఖ్యంగా కేరళ, తమిళనాడు,తెలంగాణ తదితర ప్రతిపక్ష రాష్ట్రాల్లో ఈ ధోరణి ఒక జాడ్యంలా ప్రబలిందని విమర్శించారు. లక్షల కోట్లు ప్రజల ధనం ఉసురు తీసిన ఆదాని కుంభకోణంలో మాత్రం మోడీ నోరుమెదపడం లేదని మండిపడ్డారు. రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను తుంగలో తొక్కి, ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడుస్తున్న బిజెపి విధానాలను వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు. జిల్లా సీనియర్ నాయకులు జొన్నా శివశంకర్ మాట్లాడుతూ వసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, జి.సుబ్బారెడ్డి, కె.కరుణాకరరావు పాల్గొన్నారు.

గుంటూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు గుంటూరు నగర తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు కోరారు.ఛలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం కోరుతూ ఆదివారం పాతగుంటూరులోని బాలాజీనగర్, ఆర్టీసీ కాలనీలోని వెంకటరావుపేట ,పరమాయకుంట, మంగళ దాస్ నగర్ ,డొంక రోడ్డులోని వెంగయ్య నగర్ ,నిరుపేదల కాలనీ, మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ లోని ప్రగతి నగర్‌లో ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి గ్యాస్, పెట్రోలు, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని విమర్శించారు. కార్మిక చట్టాలు సవరించి, పెట్టుబడిదారులకు అనుకూలంగా లేబర్ కోడ్‌లు తెచ్చిందని, కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవట్లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి జి శంకర్, భవన నిర్మాణ కార్మిక సంఘం నగర నాయకులు నక్క మస్తాన్, ఆర్టీసీ రిటైర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.గంగాధర్, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు టి.రాధ, మహిళా సంఘం నగర ఉపాధ్యక్షులు ఎం.ఆర్.దేవి. షేక్.మస్తాన్‌వలి, జి.బాబు, వెంకటేశ్వరావు, పాల్గొన్నారు

తాడేపల్లి రూరల్: బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తుందని, నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని రంగాలు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరులో రైతులతో ఆయన సమావేశమై మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పభుత్వ రంగ సంస్థలన్నిటిని ప్రైవేటుపరం చేసేందుకు పూను కున్నారని ఆయన విమర్శించారు. ప్రధానంగా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకే, కేంద్ర ప్రభుత్వం అనేక రైతు వ్యతిరేక చట్టాలు చేసిందని అన్నారు. పంటలకు సరైన గిట్టుబాటు ధరలు కల్పించకుండా, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు మూడు నల్ల చట్టాలు తెచ్చిందని ఆయన మండిపడ్డారు. ఏప్రిల్ 5న ఢిల్లీని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు పి.సుబ్బారావు రైతులు పాల్గొన్నారు.

మెల్లంపూడిలో కరపత్రాలు పంపిణీ

కేంద్ర ప్రభుత్వం ఆలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, నరేంద్ర మోడీ నిరంకుశత్వాన్ని వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో జరుగు కార్మిక కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని, ఆంధ్రప్రదేశ్సం కౌలు రైతు ఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ అన్నారు. ఆదివారం రాత్రి ఎంటిఎంసీ పరిధిలోని మెల్లెంపూడి గ్రామంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నిందన్నారు. కనీస మద్దతు ధర చట్టాన్ని అమలు చేయకుండా, రైతులపై అనేక భారాలు వేసేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం పూనుకుందని ఆయన విమర్శించారు. ఏపి కార్మిక సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి బత్తుల సంసోను, సిఐటియు తాడేపల్లి మండల సహాయ కార్యదర్శి కంచర్ల సాంబశివరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు కంచర్ల మరియమ్మ, భవన నిర్మాణ కార్మికులు పఠాన్ జబ్బర్, పఠాన్ నాగుల్ మీరా, షేక్ నూరుల్లా, షేక్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరు : గడిచిన 9 ఏళ్ళల్లో మోడీ ప్రభుత్వం ఒక్క ప్రభుత్వ రంగ పరిశ్రమను స్థాపించలేదని, కార్మిక చట్టాల రద్దుచేసి లేబర్ కోడ్‌లగా మార్చి శాశ్వత ఉద్యోగులను తగ్గించి కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తుందని గుంటూరు జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి వై నేతాజీ అన్నారు. ఆదివారం మేడికొండూరులో సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండల సిఐటియు అధ్యక్షులు ఎస్కే భాషా ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కీం వర్కర్లకు వేతనం పెంచకుండా కేంద్ర , ప్రభుత్వాలు వారిపై పని భారం పెంచుతున్నారని అన్నారు. కార్పొరేట్లకు పన్నుభారం తగ్గించి సాధారణ ప్రజలపై పన్నుల భారం పెంచి ఆ సంపదను అదానీకు, అంబానీలకి కట్ట బెడుతున్నాడని విమర్శించారు. దేశంలో నిరుద్యోగ శాతం తారా స్థాయికి చేరుకుందని, .మోడీ చేసే అనైతిక పరిపాలన వ్యతిరేకిస్తూ ఏప్రియల్ 5జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే కౌలు రైతు సంఘం నాయకులు బొట్ల రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర .చెప్పిన వాగ్దానం నెరవేర్చకుండా ఈ ఏడాది కేంద్ర బడ్జెట్లో వ్యవసాయం రంగానికి లక్ష కోట్ల రూపాయల కోత విధించిందన్నారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయవలసిందిగా కోరారు .ఈ కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, నాగేశ్వరరావు, దావీదు, సుబ్రహ్మణ్యం, ఏసోబు ,శంకరరావు, లక్ష్మీనారాయణ ,రమేషు పాల్గొన్నారు.

దుగ్గిరాల : కార్మిక కర్షక సంఘర్షణ యాత్రను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జెండా శివశంకర్ కోరారు మండలంలోని మంచి గొల్లపూడి గ్రామంలో ఆదివారం సాయంత్రం రైతు సంఘ మండల అధ్యక్షుడు వై బ్రహ్మేశ్వర రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని అత్యధిక సంఖ్యలో కార్మిక కర్షక వర్గం పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు బి సాంబశివరావు, బి. అమ్మిరెడ్డిచ, అద్దంకి పాములు, పి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఇదే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు రేవేంద్రపాడులో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మోర్ల శ్రీనివాసరావు, ఇ. శంకర్, ఈడే వెంకటప్పయ్య, జె వెంకటేశ్వరరావు, ఎస్ కే సైదా, రామారావులు పాల్గొన్నారు.


మెల్లంపూడిలో కరపత్రాలు పంచుతున్న నాయకులు


గుంటూరులో కరపత్రాలు పంచుతున్న నాయకులు


దుగ్గిరాలలో కరపత్రాలు పంచుతున్న నాయకులు


మంచికలపూడిలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

తొలగించిన సెక్యూరిటీ గార్డులను విధుల్లోకి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వై.నేతాజి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఎయిమ్స్‌లో సెక్యూరిటీ గార్డ్స్‌గా పనిచేస్తున్న 84 మందిని అక్రమంగా తొలగించడం జరిగిందని వారిని వెంటనే పనిలోకి తీసుకోవాలని సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ అన్నారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో ఎయిమ్స్ సెక్యూరిటీ అసోసియేషన్ విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జి కోటేశ్వరావు అధ్యక్ష వహించారు. నేతాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానం వల్లే ఎయిమ్స్‌లో సెక్యూరిటీ గార్డ్స్‌ను తొలగించడం జరిగిందని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇటీవల మిలిటరీలోకి అగ్ని వీరుల పథకాన్ని తీసుకురావడం జరిగింది అన్నారు. ఈ పథకం వలన మూడు సంవత్సరాలు మిలటరీలో పనిచేసిన వారిని తొలగిస్తారని తెలిపారు. ఆ తర్వాత వారిని ఎక్స్ సర్వీస్ మెన్‌గా ఇలాంటి ఉద్యోగాల్లో పెడతారని అన్నారు. ఆ నిర్ణయం ప్రకారమే ఎయిమ్స్‌లో సెక్యూరిటీ గార్డ్స్‌గా ఎక్స్ సర్వీస్ మెన్ తీసుకుంటున్నారని అన్నారు. అయితే ఉన్నవారిని తొలగించడం అన్యాయమని అన్నారు. వారికి ఉపాధి చూపించాల్సింది పోయి తొలగించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. అక్రమంగా తొలగించిన కేంద్ర ప్రభుత్వం విధానంపై ప్రజల్లో ప్రచారం చేయాలని ఆయన కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని శాఖల్లోనూ పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా చేసేందుకు పూనుకుంటున్నాయని విమర్శి ంచారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కూడా రద్దు చేస్తున్నారని అన్నారు. వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం జరిగిందన్నారు. ఎయిమ్స్‌లో తొలగించిన కార్మికులను తీసుకునేంతవరకు ఆందోళన వివిధ దశల రూపంలో చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అందుకు సిఐటియు అండదండలు ఉంటాయని అన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్ చెంగయ్య, అసోసియేషన్ కార్యదర్శి పి శివశంకర్, నాయకులు కే బుచ్చిబాబు, ఆ రంగారావు, పి సాంబశివరావు, ఉట్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'మట్టి బండి' గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

తెలుగు భాషోద్యమ నాయకుడిగా, రచయితగా, పరిశోధకుడిగా, కవిగా, బాల సాహిత్యకారుడిగా, వ్యాకరణ భాష్యకారుడిగా ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ బహుముఖ ప్రజ్ఞాశాలి అని రాష్ట్ర మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బృందావన్‌గార్డెన్స్, వెంకటేశ్వరస్వామి దేవస్థానప్రాంగణంలో ఎన్‌జిరంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ రాసిన 'మట్టి బండి' గ్రంథావిష్కరణ సభ సాహిత్య ప్రముఖుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. వికాస్ విద్యాసంస్థల అధినేత పివి శంకరరావు అధ్యక్షతన జరిగిన సభలో మండలి బుద్ధప్రసాద్ పుస్తకావిష్కరణ చేశారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగుజాతి గర్వించదగ్గ రైతాంగ నాయకుడు ఆచార్య రంగ అనుయాయుడిగా డాక్టర్ జక్కంపూడి సీతారామారావు సహకారంతో డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ తనలోని భావుకత్వాన్ని, ఆవేదనను, మట్టిబండి పుస్తకం ద్వారా చాటిచెప్పాడని కొనియాడారు. సాహితీ భీష్మాచార్యుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ భూమిపుత్రుల కష్టాల కడగళ్లను, వారి దుర్భర జీవితాన్ని మట్టిబండి దీర్ఘ కవిత ద్వారా ఆదినారాయణ కళ్ళకు కట్టినట్టు వర్ణించాడన్నారు. ఈ సందర్భంగా జక్కంపూడి సీతారామారావు ఆచార్య ఎన్జీరంగా ఫౌండేషన్ తరపున 'భాషావిభూషణ' బిరుదుతోపాటు సువర్ణ హస్తభూషణం, నూతనవస్త్రాలు ఆహుతుల సమక్షంలో అందజేశారు. డాక్టర్ పెళ్లూరు సునీల్ గ్రంథ సమీక్ష చేశారు. డాక్టర్ వెనిశెట్టి సింగారావు సభా కార్యక్రమాన్ని నిర్వహించగా కార్యక్రమంలో విజిఎస్ పబ్లికేషన్స్ సీరం రామారావు, రవిపబ్లికేషన్స్ మక్కెన ఆంజనేయరావు తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్

జాతీయ స్థాయి ఎడ్ల పందేలు ప్రారంభం



ప్రజాశక్తి-రాజుపాలెం

మండలంలోని గణపవరంలో ప్రసన్నాజనేయ స్వామి వారి 94 జయంతి సందర్భంగా ఆదివారం జాతీయ.స్థాయి ఎడ్ల పందేలను సత్తెనపల్లి నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు మన్నెం శివ నాగ మల్లేశ్వర రావు ప్రారంభించారు. మొదటి రోజు రెండు పళ్ళ దూడల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తెలుగు రాష్ట్రాల నుండి 14 జతల ఎడ్లు జతలు తలపడ్డాయి. ఈ పందేలు ఈ నెల 15 వ తేదీ వరకు జరుగుతాయని నిర్వహకులు తెలిపారు. తిరునాళ్లను పురస్కరించుకుని దేవాలయం ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



మాగులూరి ఫౌండేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని పాటిబండ్లకు చెందిన పేద విద్యార్థి రేవతి, అదే గ్రామానికి చెందిన నోటి కేన్సర్‌తో బాధ పడుతున్న సయ్యద్ సుభానికి ఆదివారం మాగులూరి ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందజేసింది. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఎం.హరిబాబు, ఎం.కృష్ణారావు, కిరణ్, ప్రసాద్, శ్రీను, సుబ్బారావు, రామారావు ,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



192 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి- నకరికల్లు

స్థానిక వంగా వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాంశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వ హించారు. కొత్త లక్ష్మీనారాయణ, లక్ష్మీకాంతమ్మ వారి జ్ఞాపకార్థం, శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జిల్లా అంధత్వనివారణ సంస్థ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో 192 మందిని పరీక్షించగా, వారిలో 95 మందికి చికిత్స నిర్వహించాలని వైద్యులు తెలిపారు. డాక్టర్లు స్పందన, నీరజలు, కోఆర్డినేటర్ సైదులు, మండల వైసిపి కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షులు మేడం ప్రవీణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి -వినుకొండ రూరల్

మండలం లోని కొండ కింద ఉన్న ఉప్పరపాలెంలో గిడియన్ బాప్టిస్ట్ మినిస్ట్రీస్ ఫౌండర్ పాపగంటి అనిజాన్సన్ ఆధ్వర్యంలో ఆదివారం పిల్లలకు పుస్తకాలు,పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా సంకల్ప సొసైటీ నియెజక వర్గ అధ్యక్షులు అక్బర్ బాషా మాట్లాడుతూ గిడియన్ బాప్టిస్ట్ మినిస్ట్రీస్ ఆఫ్ ఇంటర్నేషనల్ లో చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. చర్చి పాస్టర్ పి. ఇమ్మానుయేలు పాల్గొన్నారు.

వికలాంగుల విభాగం రీజినల్ కో-ఆర్డినేటర్‌కు సన్మానం

ప్రజాశక్తి-వినుకొండ



నూజెండ్ల మండలం ఉప్పలపాడుకు చెందిన కొమిరెడ్డి శివారెడ్డిని వైసిపి వికలాంగుల విభాగానికి రాష్ట్ర రీజినల్ కో-ఆర్డినేటర్‌గా కడప, తిరుపతి, నెల్లూరు మూడు జిల్లాలకు నియమించిన సందర్భంగా సీఎం జగన్‌కు ఆయన ధన్య వాదాలు తెలిపారు. వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక లాయర్స్ స్ట్రీట్ లోని వెంకిరెడ్డి కార్యా లయంలో శివారెడ్డిని ఘనంగా సన్మానించారు.

'అరవిందబాబూ! చౌకబారు విమర్శలొద్దు'

ప్రజాశక్తి-రొంపిచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు వెంకట్రావు

మండల టిడిపి అధ్యక్షుడు వెన్నా బాలకోటిరెడ్డి హత్య విషయంలో టిడిపి నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు చౌకబారు విమర్శలు చేయడం తగదని ఎంపిపి గడ్డం బాలనాగమ్మ భర్త , వైసిపి మండల నాయకులు వెంకట్రావు విమర్శించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం వైసిపి ఎస్సి సెల్ మండల నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న వెంకట్రావు మాట్లాడుతూ బాలకోటిరెడ్డిపై రెండు సార్లు జరిగిన హత్యాయత్నంలో తనకు ఎటువంటి సంబంధం లేదని అన్నారు. బాలకోటిరెడ్డి సమీప బంధువు, టిడిపి నాయకులు పమ్మి వెంకటేశ్వరరెడ్డి మధ్య 2019 అసెంబ్లీ ఎన్నికల్లో, 2021 పంచాయతి ఎన్నికల సందర్భంగా జరిగిన విభేదాల కారణంగా బాలకోటిరెడ్డి హత్యకు గురయ్యారని చెప్పారు. అరవిందబాబు వాస్తవాలు తెలుసుకోకుండా తనపై, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పై ఆరోపణలు చేయడం తగద న్నారు. బాలకోటిరెడ్డిని తాము హత్య చేసినట్లు అరవిందబాబు, టిడిపి నాయకులు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం చేసానని, నిరూపించలేకపోతే వారు రాజకీయ సన్యాసం చేస్తారని సవాల్ విసరారు. సమావేశంలో మాల మహానాడు మండల కన్వీనర్ డి.దిబ్బయ్య, వైసిపి ఎస్‌సి సెల్ మండల నాయకులు పాల్గొన్నారు.



పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువుల వితరణ

ప్రజాశక్తి - వినుకొండ

ప్రతినెలా ఆర్థికంగా వెనుక బడిన బ్రాహ్మణ కుటుంబ ములను, వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆదుకొనే దిశలో భాగంగా ఆదివారం జీవి మాధవరావు కార్యాలయంలో 20 కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలు అందజేశారు .చింతలచెర్వు రాఘవేంద్రరావు, బొగ్గరం మార్కెండేయశర్మ, శేషమ్మ వివాహ వార్షికోత్సవ సందర్భముగా వారి కుమార్తెలు శ్రావణి, స్రవంతిలు బియ్యం పంపిణీ చేశారు. గాదె రాధిక 20 మందికి చీరలు అందజేశారు. ఎక్కువ మందిని ఆదు కొన్న దాత జూనూతల చంద్ర మోళేశ్వర శాస్త్రి, మందడపు వెంకటేశ్వరశర్మ శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. బి.సుబ్రహ్మణ్యం, బి. రవికుమార్, డి. నాగేశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావు, పి.నారాయణరావు పాల్గొన్నారు.

ఫీజు కడితేనే హాల్‌టిక్కెట్ ఇస్తామనడం తగదు

ప్రజాశక్తి-నరసరావుపేట

రైతుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రయివేటు కళాశాలల యాజమాన్యం మాన వత్వంతో వ్యవహరించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ అన్నారు.స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఫీజు కడితేనే హాల్ టికెట్ ఇస్తామని ప్రైవేట్ కళాశాల యాజమాన్యం చెప్పడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. ఇంటర్ బోర్డు అధికారులు ప్రయివేటు కళాశాలల యజమాన్యంతో మాట్లాడి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు హాల్ టికెట్లు ఇచ్చి పరీక్షలు రాసేందుకు అనుమతించాలని కోరారు. ఈ నెల 15 నుండి జరగబోయే ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు ఫీజు కడితేనే హాల్ టికెట్ అంటూ విద్యార్థుల పట్ల వేధింపులకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పల్నాడు ప్రాంతంలో 80 శాతం పైగా ప్రజలు వ్యవసాయ,అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ఆయా రంగాల్లో వరుసగా వస్తున్న నష్టాల నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులను ఒత్తిడి చేయకుండా విడతల వారిగా ఫీజులు చెల్లించే ఆనవాయితిని తీసుకురావాలన్నారు.

ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుకు సన్మానం

ప్రజాశక్తి-ఈపూరు: మండలంలోని అగ్ని గుండాలలో తిరు మల దేవుడు తిరునాళ్లను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యేకు గ్రామస్తుల సన్మానం చేశారు. శాలువాతో సన్మానించారు. గ్రామస్తులు ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ ఆకట్టుకుంది.



బలుసుపాడులో సమస్యలు తెలుసుకున్న కొమ్మాలపాటి

ప్రజాశక్తి -పెదకూరపాడు

మండలంలోని బలుసుపాడు టిడిపి అధ్యక్షులు కల్లేపల్లి వెంకటేశ్వరు రాజు కుమా రుడి రిసెప్షన్‌కు మాజీ ఎమ్మెల్యే కొమ్మాల పాటిశ్రీధర్ ఆదివారం హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్, మండల నాయ కులు, కార్యకర్తలు కె. వెంకటేశ్వరరాజు, చిన్నం శివ నాగేశ్వరావు పాల్గొన్నారు.



ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా విలేకరులు

పల్నాడు జిల్లాలోని వైసిపి కార్యాలయాల్లో ఆ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. చిలకలూరిపేటలోని ఎన్.అర్.టి. సెంటర్‌లోని వైసిపి కార్యాలయంలో వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులలర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్య కర్తల, అభిమానుల మధ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. సత్తెనపల్లిలోని స్థానికనియోజక వర్గ పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెంటచింతలలోని వైసిపి కార్యాలయంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సొంటి రెడ్డి నర్సిరెడ్డి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. నకరికల్లులోని వైఎస్సార్ విగ్రహానికి మండల కన్వీనర్ భవనం రాఘవారెడ్డి పూలమాలవేసి, అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. నరసరావుపేటలోని వైసిపి కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



చిలకలూరిపేటలోని వైసిపి కార్యాలయంలో వైఎస్ఆర్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి రజిని, తదితరులు

ప్రజాశక్తి
7
గుంటూరు జిల్లా
సోమవారం 13 మార్చి 2023



బాలోత్సవ కరపత్రాలను తిలకిస్తున్న చిన్నారులు

ఉగాది బాలోత్సవానికి తరలిరండి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఈ నెల 22వ తేదీ కుంచనపల్లి అరవింద హైస్కూల్‌లో జరిగే ఉగాది బాలోత్సవానికి పిల్లలతో కలిసి తల్లిదండ్రులు తరలిరావాలని బాలోత్సవ నిర్వాహకులు కోరారు. ఆదివారం ప్రజాశక్తి కార్యాలయం చుట్టుపక్కల ఉన్న అపార్టుమెంట్లు, కుంచనపల్లి అండర్ పాస్ నుండి ఎస్‌బిఐ వరకు, వైసిపి కార్యాలయం నుండి ప్రాతూరు క్రాస్ రోడ్డు వరకు కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు ఆసక్తిగా ఉగాది బాలోత్సవ నిర్వాహకులు పంపిణీ చేసిన కరపత్రాల్లో తాము ఏయే ఆటల్లో పాల్గొనవచ్చో తెలుసుకున్నారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ సభ్యులు పి.సురేంద్ర, ఆర్.నాగరాజు, ఎ.సుధాకర్, కె.కరుణాకర్‌రావు పాల్గొన్నారు.

జిఎంసి సిటీ ప్లానర్‌గా ప్రదీప్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు

టౌన్ ప్లానింగ్ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న ప్రదీప్ కుమార్‌ని గుంటూరు నగరపాలక సంస్థ సిటీ ప్లానర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై. శ్రీలక్ష్మి జిఓ నంబర్-159ని జారీ చేశారు.గత కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న సిటీ ప్లానర్ పోస్ట్ ని ప్రభుత్వం ప్రదీప్ కుమార్‌తో భర్తీ చేసింది.



2డి ఏకో స్కానింగ్ చేస్తున్న వైద్యులు

130 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని డోకిపర్రులో నూతన సచివాలయం వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ జ్యోతుల మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో పలు రకాల రోగాలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ వి.సుధీర్ 130 మంది రోగులకు ఈసీజీ,2డి ఏకో స్కానింగ్ పరీక్షలు చేశారు. డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్. వంశీ కుమార్ డాక్టర్ ఆసిఫా, వైద్య సిబ్బంది , డోకిపర్రు ఎంపిటిసి ఎన్.రామ కోటమ్మ, సర్పంచి కె.సామ్రాజ్యం,మాజీ సర్పంచి శ్రీనివాసరావు, కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ ఎన్. కోటిలు పాల్గొన్నారు.



కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్న రామనాథం వెంకటేశ్వరరావు

ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

నగరంలోని రామనాథం చినకోటయ్య శివపార్వతమ్మ వృద్ధుల సేవాశ్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు రామనాథం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం 94వ నేత్ర పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్ళజోళ్ళు అవసరం ఉన్న 50 మందికి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీకే గర్ల్స్ స్కూల్ సెక్రటరీ వింజమూరి వినయ్ కుమార్, శంకర్ రైస్ మిల్ అధినేత ఇండ్ల శ్రీనివాసరావు, ధ్యానరత్న ఆకురాతి శంకర్రావులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల ప్రాంతాల్లో ఆ షాపులు తెరవొద్దు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మార్చ్ 15 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహించబోయే బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ పరీక్షలకు ఆయా పరీక్ష కేంద్రాలవద్ద సెక్షన్ 144 అమలు చేయనున్నట్లు తెనాలి తహశీల్దార్ రవిబాబు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ఆదేశానుసారం ఇంటర్మీడియట్ పరీక్షాకేంద్రాలు వద్ద పోలీసు బందోబస్తు పటిష్ట పరుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎటువంటి అవాంఛిత సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు. పరీక్షలు నిర్వహించు సమయంలో పట్టణ, గ్రామీణ పరిసరాల్లో జిరాక్స్ షాపులు తెరవరాదని హెచ్చరికలు జారీ చేశారు. పట్టణంలో వైష్ణవి జూనియర్ కాలేజ్, రైల్వే స్టేషన్ రోడ్డు, తెనాలి, జె ఎం జె కాలేజ్ ఫర్ ఉమెన్, డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ జూనియర్ కాలేజ్, ఎన్ ఆర్ ఐ కాలేజ్, స్టేషన్ రోడ్డు, వి ఎస్ ఆర్ ,ఎన్ విఆర్ కాలేజ్, శ్రీ వివేకానంద జూనియర్ కాలేజ్ ఫర్ గర్ల్స్, నాజర్ పేట, శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, గాంధీ నగర్, నెహ్రు నికేతన్ జూనియర్ కాలేజ్, బోస్ రోడ్, శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, టు టౌన్ పోలీస్ స్టేషన్, జెపి నగర్, నారాయణ జూనియర్ కాలేజ్, గంగానమ్మపేట, ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజ్, గంగానమ్మపేట కళాశాలలో పరీక్షా కేంద్రాలుగా ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో పోలీసుల బంధోబస్తు ఉంటుందని తెలిపారు.

రహదారిని పున:నిర్మించాలని నిరసన



రోడ్డు పై నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- దుగ్గిరాల

తెనాలి విజయవాడ రహదారిని పునర్ నిర్మించకపోతే రోడ్డుపై బైఠాయించి దీక్ష చేస్తామని టీడీపీ గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గం ఇంచార్జ్ పోతినేని శ్రీనివాస్ అన్నారు. తెనాలి విజయవాడ రహదారిపై ఆదివారం తుమ్మపూడి నుండి రేవేంద్రపాడు వరకు పాదయాత్ర నిర్వహించి నిరసన తెలిపారు. ఈ రహదారి గత మూడు సంవత్సరాల నుండి అధ్వానంగా తయారైందని వాహనదారులు నాన ఇబ్బందులు పడుతున్నారని మనుషులు కూడా నడవలేని పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ఎన్ని మెమోరాండంలు ఇచ్చిన ఉపయోగం లేదని అన్నారు. విషపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను నానా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మున్సిపల్ నిధులతో బినామీ పేర్లతో గౌతమ బుద్ధ రోడ్డు వేయటమే తప్ప నియోజకవర్గ అభివృద్ధికి ఏమి చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత ,మండల కార్యదర్శి తాళ్ల అశోక్, బుస నాగరాజు, వి. శ్రీనివాస్ నాయుడు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ, నెహ్రూ త్యాగాలనూ అపహాస్యం చేస్తున్న బిజెపి

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో జాతిపిత మహాత్మా గాంధీ, ఆధునిక భారత నిర్మాత జవహర్ లాల్ నెహ్రూలు చేసిన త్యాగాలను కూడా బిజెపి అపహాస్యం చేస్తుందని పొన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ జక్కా శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఉప్పు సత్యాగ్రహం దండి మార్చ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కట్టెంపూడి అడ్డరోడ్డులో గల జాతిపిత మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జక్కా శ్రీనివాస్ అక్కడినుంచి 'హాథ్ సే హాథ్ జోడో అభియాన్' యాత్రను కొనసాగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో మతతత్వాన్ని పెంపొందించి తమ ఉనికిని కాపాడుకోవటం కోసం బిజెపి దిగజారుడు రాజకీయాలకు పూనుకుంటుందని, స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారి అడుగులకు మడుగులు వత్తిన సావర్కర్‌ను ఈరోజు స్వాతంత్ర్యసమరయోధునిగా చిత్రీకరించి నాడు అమరులైన ఎందరో వీరుల త్యాగాలను అపహాస్యం చేస్తున్నారని, ప్రజలు ఇది గమనించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాడిశెట్టి సాంబశివరావు, పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షులు గౌస్, బాలాజీ, బాషా, ఫణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజక వర్గ ఇంచార్జ్ జక్కా శ్రీనివాస్

ఘనంగా ఆపిల్ నాలెడ్జ్ కార్నివాల్-2023



ప్రదర్శనలో పాల్గొన్న యాపిల్ సెక్రెటరీ రవికుమార్, ప్రిన్సిపల్ అజయ్ కుమార్

ప్రజాశక్తి- మేడికొండూరు

ప్రజా ప్రయోజనాలు, దేశ ప్రయోజనాలు అబివృద్ధి పొందే విధంగా ప్రతి విద్యార్థి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని శాస్త్రవేత్తగా ఎదగాలని ఆపిల్ విద్యాసంస్థల సెక్రటరీ ఇమ్మడి రవికుమార్ అన్నారు. మండలంలోని పేరేచర్ల ఆపిల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో ఆదివారం ఆపిల్ నాలెడ్జ్ కార్నివాల్-2023 ఘనంగా నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆపిల్ విద్యాసంస్థల సెక్రటరీ ఇమ్మడి రవికుమార్ పాల్గొని కార్నివాల్ సైన్స్ ప్రదర్శన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తాను ఒక లక్ష్యాన్ని ఎంచుకొని, సముచిత స్థానంలో ఎదిగి స్థిరపడి దేశానికి కూడా ఉపయోగపడే దిశగా రాణించాలని అన్నారు. యాపిల్ హై స్కూల్ ప్రిన్సిపాల్ మోరపాకుల అజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో కానీ, ఆటపాటలలో కానీ, మరే రంగంలో అయినా కష్టంతో కాకుండా ఇష్టంతో పనిచేస్తే మంచి ఫలితాలు దరిచేరతాయని అన్నారు. ఈ ఆపిల్ కార్ని వాళ్ళ అలర్జీలో సుమారు 250 ప్రాజెక్టులను విద్యార్థులు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా భువన విషయం పంబన్ బ్రిడ్జి, మాక్ అసెంబ్లీ, 3డి ప్రొజెక్టర్లు , ఎన్విరాన్మెంటల్ స్టడీ, విలేజ్ సెట్ రకాలు సూపర్‌లను ప్రత్యేకంగా ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఆపిల్ మోరపాకుల శాంతి, పలువురు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

విలక్షణ కవి కొణతం నాగేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు

చందోబద్ధంగా పాట, పద్యరచనలు చేయటంలో విలక్షణ కవిగా కొణతం నాగేశ్వరరావు కీర్తి గడించారని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ గుజ్జర్లమూడి కృపాచారి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేట సిపిఎం కార్యాలయం, కొరటాల సమావేశ మందిరంలో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, సాహితీ కళారత్న కొణతం నాగేశ్వరరావు రచించిన 'గీత రచనాదీపిక' గ్రంథావిష్కరణ చేసి, మేళం బాబురావుకు తొలి గ్రంథాన్ని అందజేశారు. కృపాచారి మాట్లాడుతూ జానపద గేయాలలో ఉన్న అప్రయత్న, ఆసు, కవితా ధారలు అనే మూల సూత్రాన్ని పట్టుకొని రచయిత నాగేశ్వరరావు విశ్లేషణాత్మకంగా సాహిత్యంపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకునేటట్లు గ్రంథస్తం చేశాడని కొనియాడారు. డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గీతరచనా దీపికలో భావి కీర్తనకారులకు, గేయ రచయితలకు కావాల్సిన సంగీత, సాహిత్య, స్వర, తాళ, లయాత్మక దిక్సూచిగా ఉన్నదని ఆకోవలో గ్రంథరచన చేసిన తొలి రచయిత నాగేశ్వరరావు అని ప్రశంసించారు. సభకు డాక్టర్ వెలుగోలు నాగరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. నాటక ప్రయోక్త తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షులు కేజే రమేష్ గ్రంథసమీక్ష చేశారు. కార్యక్రమంలో రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని, సాహితీవేత్తలు బి.వేదయ్య, ఎంపి జానుకవి, బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, రావి రంగారావు, కందిమళ్ల శివప్రసాద్, తాటికోల పద్మావతి, మాధవి, పింగళి భాగ్యలక్ష్మి, యక్కంటి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న ధనుంజయరావు

అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ కార్యదర్శిగా ధనుంజయరావు

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణానికి చెందిన గుత్తికొండ ధనుంజయరావును అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ కార్యదర్శిగా నియమిస్తూ అఖిల్ భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగడ్ల స్వామి ఉత్తర్వులు జారీ చేశారు.ఆదివారం హైదరాబాద్ నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో జరిగిన ఒ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగడ్ల స్వామి గుత్తికొండ ధనుంజయరావుకు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, సంఘం జాతీయ గౌరవాధ్యక్షులు శ్రీధర్ ఎన్ సుంకూర్వార్, కోస్తాంధ్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు జివి నాగేశ్వరరావు, రాయలసీమ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కె.లక్ష్మీనారాయణ, పాండిచ్చేరి రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ రఘుపతి, జాతీయ ఉపాధ్యక్షులు వృద్ధి నరసింహులు, సంఘం ఇంజనీరింగ్ విభాగం జాతీయ అధ్యక్షులు పి. పాండురంగయ్య, తమిళనాడు రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు వీరమల్లు రవీంద్రన్, కర్ణాటక రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు కె. కాలప్ప, అహోబిలం పద్మశాలి అన్న సత్రం కమిటీ అధ్యక్షులు పి. తులసి శ్రీనివాస్ పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిప్స్ కాలేజి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు మండలం, యనమదలలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఇండియన్ ఫార్మాసూటికల్ అసోసియేషన్, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నగరంలోని ఆదిత్య సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించారు. గ్రామంలో అవగాహనా ర్యాలీ చేసి ఆరోగ్య అవగాహన, పరిసరాల పరిశుభ్రత, వివిధ రకాల వ్యాధులు ఎలా వ్యాప్తి చెందుతాయి, వాటి నుండి నివారణ చర్యల గురించి కరపత్రాలను పంచి, మరుసటి రోజు నిర్వహించే వైద్యశిబిరం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యశిబిరాన్ని డాక్టర్ జి.వి.కాశీరామ్, డాక్టర్ బి.భరణి ప్రారంభించగా బిపి, షుగర్, రక్త పరీక్షలు, బిఎంఐ వంటి పరీక్షలు చేశారు. అనంతరం నగరంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.వి.కాశీరామ్, డాక్టర్ పి.కృష్ణప్రవంత్, డాక్టర్ చదలవాడ నాగార్జున, డాక్టర్ బి.భరణి, తదితరులు ఉచిత వైద్య పరీక్షలు, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య బృందానికి సర్పంచ్ జి.ఆదినారాయణ, ఉపసర్పంచ్ పి.మాధవరావు, కార్యదర్శి జ్యోత్స్న, ఎంపిటిసి ఎన్.స్వప్న ధన్యవాదాలు తెలిపారు.

దళితుల భూములకు పట్టాలివ్వండి

- గురజవోలులో పొలాలను పరిశీలించిన వ్యవసాయ కార్మిక సంఘం
- ముంపునకు గురిచేసేందుకు పెత్తందార్లు కుట్ర పన్నుతున్నారని విమర్శ
- భూములను దక్కించుకునేందుకు పోరాట కమిటీ ఎన్నిక



పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని గురజవోలులో దళితులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను అడంగల్‌లో నమోదు చేసి, డికె పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కారుచోల రోశయ్య, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా భూములను వారు ఆదివారం సందర్శించి మాట్లాడుతూ సర్వే నంబర్ 296-ఎ లో సుమారు 160 ఎకరాల సాగు భూమి ఉందని, ఇందులో సుమారు 20 ఎకరాలు తాగునీటి చెరువు కింద విడగొట్టారని, మిగిలిన 140 ఎకరాలను గ్రామంలోని భూమిలేని పేదలు, దళితులు తరతరాలుగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. గతంలో గ్రామంలోని అధికార, ప్రతిపక్షాలకు చెందిన పెత్తందారులు ఈ భూముల్లోని మట్టిని కాజేయాలని నీరు-చెట్టు పేరుతో తవ్వడానికి ప్రయత్నించగా నాడు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దళితులు ఉద్యమించారని, ఇప్పుడు కూడా వర్షపు నీరు పోకుండా పెత్తందార్లు కరకట్టలు వేయిస్తున్నారని, తద్వారా దళితుల భూములను ముంపునకు గురిచేయాలని కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఈ భూములే ఆధారంగా 140 కుటుంబాలు జీవిస్తున్నాయని, వీరికి చట్టబద్ధమైన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ భూముల్లో ప్రతి సంవత్సరం ఖరీఫ్‌లో వరి, దాళ్వలో పెసర, కంది తదితర పంటలు పండిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన భూరీసర్వేలో ఈ భూములను సాగు భూములుగా పరిగణించి సర్వే సబ్ డివిజన్ చేసి, లబ్ధిదారులకు ఎవరి భూమికి వారికి డీకే పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్ సాధన కోసం భూపోరాట కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా లక్కీపోగు పెద్దబ్బాయి, గొర్రెపాటి ప్రకాశరావు, మరో 9 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రావినూతల పుల్లయ్య, ఎర్ర మస్తానయ్య, కె.గాలేసు, రావినూతల దానేలు, జోజి, పెదమస్తానయ్య, కొండవీటి వెంకయ్య, దావల మస్తాన్‌రావు, కొండవీటి ప్రభుదాసు పాల్గొన్నారు.

క్షయ నివారణకు చర్యలు

- జిల్లా వ్యాప్తంగా ఆరు కేంద్రాల్లో చికిత్స
- ఆరు నెలల పాటు ఉచితంగా పోషకాహారం
- ప్రజాశక్తితో జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ బి.లక్ష్మానాయక్



జిల్లాలో క్షయవ్యాధి నియంత్రణకు కృషి చేస్తున్నట్టు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయవ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ బి.లక్ష్మానాయక్ తెలిపారు. వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి సకాలంలో చికిత్సలు అందించి ఒకరి నుంచి మరొకరికి వ్యాధి సక్రమించకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. క్షయ బారిన పడినవారికి ఆరు నెలల పాటు పోషక పదార్థాలను అందిస్తున్నట్టు చెప్పాని ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు.



క్షయను ఎలా గుర్తించాలి? అందిస్తున్న చికిత్సలు?

వారం రోజులు కంటే ఎక్కువ రోజులు దగ్గు తీవ్రంగా ఉంటే కళ్లే పరీక్ష చేయించుకోవాలి. వీటితో పాటు హెచ్ఐవి, షుగర్ పరీక్షలు చేయించుకోవాలి. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేరోగుల్లో ఎక్కువ రోజులు దగ్గు ఉంటే వెంటనే వారిని గుర్తించి పరీక్షలు చేయిస్తాం. పిహెచ్‌సిలు, సిహెచ్‌సిల నుంచి కూడా గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి రోగులను రిఫర్ చేస్తారు. వీరికి కళ్లే పరీక్ష చేస్తే పాజిటివ్ వస్తే కౌన్సెలింగ్ చేసి చికిత్స ప్రారంభిస్తాం. ఏం చేయాలి, ఏం చేయకూడదో అవగాహన కల్పిస్తాం. రెండు నెలలు దాటి దగ్గు కొనసాగితే తీవ్రతను పరిశీలిస్తాం. వ్యాధి వ్యాప్తించకుండా నియంత్రణ చర్యలు చేపడతాం. బ్యాక్టీరియా వల్ల (మైక్రో బ్యాక్టీరియా టూబర్ క్లోసిస్) ఈ సమస్య వస్తుంది. ఎక్స్‌రే తీయించుకోవాలి. మందులు ఉచితంగా ఇస్తాం. రెండో దశలో నాలుగు నెలలకు మందులు ఇస్తాం. వీరికి ప్రత్యేకంగా వైద్య సిబ్బందిని కేటాయించి వారి పర్యవేక్షణలో చికిత్స చేయిస్తాం. ల్యాబ్ టెక్నిషియన్, హెల్త్ విజిటర్, ఇతర సిబ్బంది వీరిని పరిశీలిస్తుంటారు. 2025 నాటికి క్షయను పూర్తిగా నిర్మూలించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

జిల్లాలో ఎంత మంది క్షయ పీడితులున్నారు?

గత అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు 2125 మందిని గుర్తించాం. గుంటూరు నగరంలో అత్యధిక కేసులు వస్తున్నాయి. ప్రైవేటు డాక్టర్లు కూడా పరీక్షలు చేసి టిబి నిర్ధారణ అయిన తరువాత ప్రభుత్వ ఆస్పత్రికి పంపుతారు. వీరికి ఆరునెలలపాటు చికిత్సలు మేమే అందిస్తాం. తెనాలి, పొన్నూరు, ప్రత్తిపాడు, మంగళగిరి, గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమలో టిబి చికిత్స కేంద్రాలు పని చేస్తున్నాయి. ఇక్కడ వైద్యులు, సిబ్బంది వున్నారు. 4 లక్షల జనాభాకు ఒక యూనిట్ పని చేస్తోంది. జిల్లా మొత్తం మీద ప్రాథమిక పరీక్ష కోసం 12 లేబరేటరీలున్నాయి.

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

మాస్కులు ధరించడం తప్పనిసరి అని రోగులకు చెబుతున్నాం. ఒకరి నుంచి మరొకరికి తుంపర్ల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. అందువల్ల కరోనా తగ్గినా ప్రజలందరూ మాస్కులు తప్పనిసరిగా ధరించాలి. ఇందువల్ల శ్వాస కోశ సంబంధ వ్యాధులు కూడా అరికట్టవచ్చు. వ్యాధి గ్రస్తులు ఇతరులకు దూరంగా ఉండాలి.

పోషకాహారం ఎలా అందిస్తారు?

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి టి.బి.ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని టిబి వ్యాధిగ్రస్తులకు పోషకాహార పదార్థాలు, ఫుడ్ బాస్కెట్‌లు పంపిణీ చేస్తున్నాం. 3 కిలోల రాగిపిండి, కిలో వేరుశనగలు, కిలో పంచదార, కిలో శనగలు, లీటరు వంటనూనె కలిగిన కిట్లను అందిస్తున్నాం. జిల్లాలో మొత్తం 2 వేల మంది టి.బి పేషెంట్లకు ఎస్‌బిఐ, ఐటిసి, నాట్కో ఫార్మాస్యూటికల్స్ ట్రస్ట్ విభాగం, జిల్లా కలెక్టరు, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో వీరికి పోషకాహార కిట్లను అందిస్తున్నాం. దాతల ద్వారా వీటిని సేకరిస్తున్నాం. నెలకు రూ.700 చొప్పున ఒక్కో రోగికి ఆరు నెలల పాటు పోషకాహారం అందించేందుకు దాతలు ఎవరైనా రూ.4200 అందివ్వాలి. జిల్లా కలెక్టర్ పేరున ఉన్న ప్రత్యేక బ్యాంకు ఖాతాకు దాతలు తమ విరాళం పంపవచ్చు.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కంగారొద్దు.. ప్రశాంతంగా రాయండి..

- ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు
- నిముషం ఆలస్యమైనా అనుమతించబోము
- హడావిడిగా రాసి వెళ్తామన్నా పంపించం
- జిల్లా వృత్తి విద్యాధికారి ఎం.నీలవతిదేవి



ప్రజాశక్తి - నరసరావుపేట

ఇంటర్ పరీక్షలు ఈనెల 15 నుండి వచ్చేనెల 4 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో పకడ్బంది ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా వృత్తి విద్యాధికారి (జిల్లా ఒకేషన్ ఎడ్యుకేషన్ ఆఫీసర్) ఎం.నీలవతిదేవి చెప్పారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా, మాస్ కాపీయింగ్, ఇతర అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా నిఘా ఉంచుతామని చెప్పారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలుంటాయని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తామని, విద్యార్థుల సంఖ్య ఆధారంగా పోలీస్ బందోబస్తు ఉంటుంద న్నారు. పరీక్ష కేంద్రాలను హై పవర్, పరీక్షల నిర్వహణ కమిటీ, సిఎస్ (చీఫ్ సూపరిం టెండెంట్), డిఒ (డిపార్ట్మెంట్ అధికారి) ఆకస్మికంగా తనిఖీ చేస్తారని తెలిపారు. విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నీలవతిదేవి పలు సూచనలు చేశారు.

పల్నాడు జిల్లాలో 44 పరీక్ష కేంద్రాల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 14712 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 15818 మంది. మొత్తంగా 30530 మంది పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు. అన్ని కేంద్రాల్లో బల్లలు, కుర్చీలు, తాగునీటి సదుపాయం కల్పిస్తున్నామని, ఎండల తీవ్రత నేపథ్యంలో కేంద్రాల వద్ద ఎఎన్ఎం ఉంటారని, మందులూ అందుబాటులో ఉంటాయని తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా, ప్రయాణ సౌకర్యానికి ఇబ్బందులు రాకుండా ఆయా శాఖల అధికారులతో మాట్లాడామని చెప్పారు. విద్యార్థులు సమయపాలన కచ్చితంగా పాటించాలని, ఒక్క నిముషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులతో పాటు హాల్ టికెట్ పెన్ను, పెన్సిల్ మాత్రమే అనుమతి స్తామన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలుంటాయని, విద్యార్థులు 8.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని చెప్పారు. పరీక్షకు ముందురోజు కేంద్రాన్ని చూసుకోవడం మంచిదని, పరీక్ష రోజు కంగారుపడి ఆందోళనకు గురికావొద్దని సూచించారు.

కొంతమంది విద్యార్థులు హడావుడిగా పరీక్ష రాసేసి బయటకు వెళతామంటే పంపబోమని, పరీక్ష సమయంలో కనీసం రెండున్నర గంటలు పూర్తయ్యాకే పరీక్షా కేంద్రం నుండి బయటకు వెళ్లాడానికి అనుమతి ఉంటుందని తెలిపారు. ఓ.ఎం.ఆర్ పత్రం నింపే విషయంలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. విద్యార్థులు తమకు కేటాయించిన 24 పేజీల బుక్‌లెట్‌పై ఉన్న నంబర్‌ను ఓఎంఆర్ పత్రం పార్ట్-1, పార్ట్-2 పై తప్పనిసరిగా వేయాలని చెప్పారు. ఆన్సర్ బుక్‌లెట్ మాత్రమే ఇస్తారని, అదనపు పత్రాలు ఇవ్వరని తెలిపారు. హాల్ టికెట్ ఓఎంఆర్ పత్రంలోని వివరాలను విద్యార్థులు సరి చూసుకోవాన్నారు. సమాధాన పత్రంపై విద్యార్థులు పేరును రాయడానికి వీల్లేదని చెప్పారు. విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలని, పరీక్షను ప్రశాంతంగా రాయాలని సూచించారు. అందరూ పరీక్షలు బాగా రాసి జిల్లాకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు.